# కరంట్ కథ

## బోయ జంగయ్య

బావిలోని నీటిని బయటికి పోస్తున్న కరెంటు మోటారును చూస్తూ, బావిగడ్డ మీద నిలుచొని చూస్తున్నాడు రాజయ్య. మోట తప్పింది. పాటు ఎరిగి పనిచేసుకొని, పుట్లకొద్దీ పండించుకొని పిల్లలను చదివించుకోవాలి అనుకుంటూ పారుతున్న పొలం వైపు చూసాడు.



విత్తనం మొలకెత్తి, పెరిగి పెద్దదై పంటకొచ్చేవరకు ఎంత కష్టపడాలి, ఎన్ని కళ్ళతో కాపాడాలి. తీరా పంట చేతికొచ్చేసరికి గాలిదుమారాలు, వడగళ్ళ వానలు ఎన్నిటిని తప్పించుకుంటే పంట ఇల్లు చేరుతుంది.

దొడ్డి ముందు కుంపటి దగ్గర పడుకున్న కుక్క ఒక్కసారే అరవడం విని అటువైపు చూసాడు. ఓ జీప్ బావిగడ్డ వైపే వొస్తూ వుంది. దాన్ని చూసి లేగదూడ తోక పైకెత్తి తల్లి మేస్తున్న వైపు పరుగెత్తింది. 'జీప్‌లో వచ్చేది ఎవరన్న', అనుకుంటూ దాన్నే చూస్తూ, నిలుచున్నాడు రాజయ్య. అది తాను నిలుచున్న గడ్డకు కొంచెం దూరంలో ఆగింది. అందులో నుంచి దిగిన ముగ్గురు తన వైపే వస్తున్నారు. రాజయ్య వాళ్ళను గుర్తుపట్టాడు.

ముందు నడిచే ఇద్దరిలో ఒకతను ఎస్.ఓ., రెండవ అతను లైన్ ఇన్‌స్పెక్టర్. వాళ్ళ వెనకాల మౌనంగా చేతిరుమాలుతో మధ్య మధ్యన నుదురును, మెడను వొత్తుకుంటూ నడుస్తున్న ఎ.ఇ. 'ఏల్లెందు కొస్తున్నట్టు, తనతో వీళ్ళకేం పని కరెంట్ బిల్ కూడా బాకీ లేదే. కొంపదీసి మోట్రు పీక్క పోరు గదా!'

"రాజన్నా! నీవు గడ్డ మీదున్నావ్. మమ్ములను గట్టెక్కించాలి" అన్నాడు ఎస్.ఓ. ముగ్గురూ గడ్డను ఎక్క ప్రయత్నం చేస్తున్నారు.

"నేనే వస్త, జారి పడేరు" అంటూ తానే దిగొచ్చాడు. ఎన్నోసార్లు చేతులెత్తి దండాలు పెట్టిన రాజయ్యకు ఈ రోజెందుకో చేతులు లేవలేదు.

"అక్కడ సింత కింద కూసుందురు పాండ్రి" అంటూ కొంచెం దూరంలో వున్న చింతలవైపు నడుస్తూ వుంటే అందరూ ఆయన్ని అనుసరించారు.

'పాపం ఎన్ని బాధలు వొచ్చినయి కొడుకులకు. నన్ను ఆఫీసు సుట్టు ఇండ్ల సుట్టు తిప్పి తిప్పి సంపిరిగదా అదె ఆ రోజు ఎస్.ఓ.గారింటికి నెయ్యి బుడ్డి తీసుకుని పోతె- '

***

"దొరా!" అంటూ గేటు కొట్టాడు.

ఎవరూ పలకలేదు. సాయంత్రం ఏడు కావొస్తూంది.

"దొరా! దొరా!" అంటూ మల్లీ కాస్త పెద్దగనే పిలిచి గేటునుకదిలించి లోనికి తొంగి చూసి, ఇంట్లోనే సినిమా ఆడుతుందే అనుకుంటూ అటే చూస్తూ నిలుచున్నాడు. ఎవరూ కదిలినట్టు కనిపించలేదు. మల్లీ గేటు కొట్టాడు.

"ఎవరూ" అంటూ వచ్చింది ఎస్.ఓ.గారి భార్య. మెడ నిండా బంగారం. 'ఇంట్లో కూడా కాళ్ళకు చెప్పలా' అనుకుంటూ చూస్తున్నాడు.

ఆమె గేటును సమీపించి, "ఎవరు కావాలి?" అనడి గింది.

"దొర'?

"లేరు. బజారు కెళ్ళారు."

"అయితే దీన్ని తీసుకోండి" అంటూ తాను తెచ్చిన నెయ్యి బుడ్డిని ఆమెకు అందిచ్చాడు.

"దొర తెమ్మన్నారా?"

"ఆ". 'కరంటు కావాలా'

"ఆ"."కిలో నెయ్యికే కరెంటొస్తద" అంటూ కిసుక్కు_న నవ్వుతూ లోపలికి నడిచింది.

రాజయ్యకు అర్థంకాలేదు ఎందుకు నవ్విందో.

నెయ్యిని ఊరి నుంచి మోసుకొస్తె ... ఛో – ఛో అంటూ ఆఫీసు వైపు మళ్ళాడు. అతని తల నిండా ఆలోచనలు అతని నడక కంటే వేగంగా. ఆఫీసుకు చేరేసరికి అక్కడ గేటు పిల్లర్ వాను కొని వాచ్‌మన్ నిలుచున్నాడు. నోట్లో సగం వరకు కాలిన బీడీ.

రాజయ్య ఆయన దగ్గరికి వెళ్ళి రెండు చేతులు జోడించి దండం పెట్టాడు.

"ఏం సంగతి" బీడీ నోట్లో నుంచి తీసి బూడి దను రాల్చుతూ అడిగాడు.

"అయ్యా ఏం లేదు. ఎస్.ఓ. దొర ఇంట్లో లేరు. మాపటికి ఈడ జర పండుకుందామని" ఏమం టాడో అని కొంచెం జంకుతూ అడిగాడు.

"ఏ ఇంటికి పోయినవు."

"ఆయనింటికే. అగో అక్కడ ఎదురుంగ వుంది గదా" అంటూ వెనక్కి మళ్ళీ చూపించాడు.

"ఎ.ఇ.గారి ఇల్లెక్కడ?"

"అదిగో అటు, ఆ రెండవ ఇల్లు" అంటూ ఆఫీస్ ఆవరణలో వున్న క్వార్టర్‌ను చూపించాడు.

"అదా అదీ ఆఫీసే అనుకున్న" అంటూ రాజయ్య ఆ ఇంటివైపు నడిచాడు. 'రూపాయలు దగ్గరున్నయి, కాలం బాగాలేదు. ఇచ్చేది తప్పదు, ఇచ్చేస్తె పీడ పోద్ది' అనుకుంటూ గేటు దగ్గర నిలుచున్నాడు. ఈ ఇంట్లో కూడా సినిమా నడుస్తున్నట్లుంది. అందరూ దాని ముందే వున్నట్లున్నరు. ఇల్లు పెద్ద గానే వుంది. చెట్లు గూడ వున్నాయి. అవేమి చెట్లో కాయలేదు, పూవు లేదు. సక్కగ తాడి చెట్టంత పెరిగినవి. 'వీళ్ళకు ఇంత మంచి ఇల్లు సర్కారోల్లు కట్టిచ్చారే మా వూళ్లో హరిజండ్లకు కూడ కట్టిచ్చింద్రు. అవి గాలికి లేసి పోయినయి. వర్షానికి కూలిపోయినయి. వీళ్ళ పనే బాగుంది. జీతానికి జీతం, ఎక్కి తిర్గేటందుకు జీపు. ఇంత మంచి ఇండ్లు' అనుకుంటూ అటు ఇటు చూసి నిక్కి గేటుపై నుంచి లోపలికి చూశాడు. భౌ..భౌ.. మంటూ తోడేలులాంటి కుక్క లేచి తన ముందటి కాళ్ళను గేటుమీద పెట్టి ఏ మాత్రం అందినా కొరికేస్త అన్నట్టు చూస్తోంది.

రాజయ్య 'దియ్యో దియ్యో' అంటూ కూర్చు న్నాడు. అది మొరుగుతూనే వుంది.

'రాజా – ఏయ్ రాజా' అంటూ లోపలినుండే కేక. కుక్క కుయ్ కుయ్ మంటూ లోపలికి పరిగెత్తింది. రాజయ్య బిక్కు బిక్కుమంటూ లోప లికోసారి చూసి మెల్లగా వెళ్ళి వాచ్‌మన్ దగ్గరికి వచ్చి నిలుచున్నాడు.

"ఏమయ్యా పటేలా వున్నారా ఎ.ఇ.గారు."

"తెలువదు."

"అడగలేదా."

"కుక్క దగ్గరికి రానిస్తలేదు."

"బయపడ్డావా?"

"అమ్మో అదెట్టుంది."

"అయినా సార్ ఇప్పుడు ఇంట్లో వుండరు. ఇప్పుడు క్లబ్బుకు పోవొచ్చు."

"క్లబ్ అంటే ఏంది సారు"

"క్లబ్ అంటే పెద్ద పెద్దోల్లు ఆడుకునే జాగ."

"రాత్రి పూట ఏమాట"

"పేకాట"

"అంటే అదే జువ్వ తిరునాలల్ల ఆడతరుగ పైసల్ పెట్టి"

"ఆ అదె గదె"

"అయితే ఈనకంటె పెద్ద దొర ఇల్లెక్కడ"

"ఆయన ఇక్కడుండడు. హైద్రాబాదులో వుంటడు. రోజు వచ్చి పోతరు."

"మరి ఈ ఎ.ఇ. దొర గంట రెండు గంటల్లో వొచ్చెనా"

"రాడు. ఆయనకు ఇంకో ఆమె వుంది. ఆమెకో ఇల్లు కూడ ఈ మధ్య కట్టిచ్చిండు. అక్కడికి పోవచ్చు."

"అట్లనా, ఆయన సర్కారు కట్టిచ్చిన ఇంట్ల వుంటూ వుంచుకున్నామెకో ఇల్లు కట్టిచ్చిండే!" అన్నాడు.

"ఆల్ల కేంది దొరలు సంపాదించినవన్ని ఎట్ల కరు సైతయి"

"ఎట్లొచ్చినవి అట్లపోతవి"

వాచ్‌మన్ వరండాలోకి వెళ్ళి రెండు బెంచీలను జతచేసి వాటి మీద చెద్దరు పరిచి పక్క మీద వాలి రాజయ్య వైపు మల్లి పడుకున్నాడు.

రాజయ్య ఓ కాలును స్టూలు మీద పెట్టుకొని అదే మోకాలు మీద రెండు చేతులు పెట్టుకొని, ఆ వేళ్ళ మీద గదమునానిచ్చి ఆలోచిస్తున్నాడు.

ఈ రోజు కూడా పని కాకపాయె. పగలు తను వొచ్చెసరికె ఎవరు లేరు. 'ఎక్కడో పెద్ద లైన్ చెడి పోతే అందరు పోయింద్రంట' అన్నాడు వాచ్ మెన్.

రాజయ్య ఆలోచిస్తూ ఆ పక్కనే వున్న బెంచి మీద వొరిగాడు. నిద్ర పట్టింది. ఆ రాత్రి గడిచింది.

***

"కరెంటు బాగా వస్తూందా?" లైన్‌మెన్.

"అయ్య మంచిగనే వస్తూంది" అంటూ గతంలో నుంచి తేరుకొని నులకమంచాన్ని వాల్చాడు.

ఎ.ఇ.గారు, ఎస్.ఓ.గారు దాని మీద కూర్చు న్నారు.

ఎల్.ఐ. గారు చింతమొదట బోర్లించిన బొక్కెన మీద కూర్చుంటూ "ఇక దీనితో నీకు పనిలేదను కుంట" అంటూ రాజయ్య వైపు చూసాడు.

"కరెంటు రాకుంటే మోటే గతి కదా. అందు కొరకె దాన్ని జాగ్రత్తగా అక్కడ పెట్టిన."

"కరెంటెందుకు రాదు"

రాజయ్య చిన్నగా నవ్వాడు.

ఎందుకు నవ్వుతున్నావు అన్నట్టు కనుబొమ్మ లను కదిలించాడు ఎస్.ఓ.

"వైర్లు తెగిపోయిన, ట్రాన్స్‌ఫారము కాలిన, ఇంక అప్పడప్పుడు కావాలని మీరె బందుగూడ చేస్తరు గదా"

ఎందుకో ఒక్కసారి అందర్ని కొరడాతో కొట్టి నట్లైంది. ఒక్కసారి ఒకరి మొఖం ఒకరు చూసు కున్నారు.

చింతకింద పడుకున్న గేదెలను చూస్తూ "ఏవైనా ఈనాయా" అంటూ మాటలను మార్చాడు ఎస్.ఓ. గారు.

"ఈన్నయి వుంటె అమ్మేసిన మొన్న"

మా మీదికి మరో రాయి అందుకున్నట్టున్నాడు అనుకొని

"రాజన్నా–"

'దొర' అంటూ ఎస్.ఓ. గారి వైపు చూస్తున్నాడు.

"నీకైతె కరెంట్ ఇచ్చినం. కాని మా పీకల మీది కొచ్చింది" అంటూ నుదురు ఓసారి తుడ్చుకున్నాడు.

"మీకా! ఎందుకు దొర. తాగినోడె కట్టె తాల్ల

## కోడిరామమూర్తి అంత్యదశ

కలియుగ భీముడని పేరొందిన మల్లయోధుడు శ్రీ కోడి రామమూర్తిగారు, గొప్ప వస్తాదుగా, సర్కస్ నిర్వాహకుడుగా దేశ దేశాలలో పేరొందాడు. మహాదాత కూడా. కోటి రూపాయిలు పైగా దానధర్మాలకు వినియోగించాడట! ఎలా సంపాదించాడో అలానే దానం చేసేవాడు.

ఇనుప గొలుసులు తెంచేవాడు. వేగంగా వస్తున్న కారును చేతితో ఆపేవాడు. ఛాతీమీద ఏనుగును ఎక్కించుకొనేవాడు. రొమ్ముపై బండ రాళ్ళను పెట్టించుకొని సమ్మెటతో మోదించు కొనేవాడు. అంతటి సాహసి మరొకడు లేడు.

అలాంటి బలశాలి, అలాంటి దాత చివరకు కాలిపై రాచపుండు లేచి కాలు తీసి వేయబడగా, దుర్భర దారిద్ర్యంతో అలమటిస్తూ 1942 లో మరణించాడు. మదన మోహన మాలవ్యా కోడిరామమూర్తిని చివరి దశలో కాశీ తీసుకెళ్ళి కొంత ఆరోగ్యం ఇప్పించాలని ప్రయత్నించాడు. కానీ ఆయన దక్కనే లేదు.

– డాక్టర్ మల్లీప్రియ "నాగరాజు"

పన్ను అన్నట్టు కరంటు పెట్టుకొన్నప్పడే..." అంటూ మంచం ఎదురుగ వున్న చిన్న గుండ్రాయి మీద కూర్చున్నాడు.

"ఈ వూల్లో చాలామంది నీ కంటె ముందు దరఖాస్తు పెట్టారట. వాళ్ళకు ఇవ్వక, మూడు స్తంభాలిచ్చి, నిన్న మొన్న దరఖాస్తు పెట్టిన నీకు ఇచ్చామట."

"మరి వాళ్ళకు..." మాట పూర్తికాకముందే–

"వాళ్ళు డబ్బులు ఇవ్వలేదట. నీవు డబ్బులిచ్చినావట. అందుకని నీకిచ్చామట."

"నేను డబ్బులిచ్చింది వాళ్ళు సూసిండ్రా."

"పై అధికార్లకు దరఖాస్తు ఇచ్చారు."

"ఇస్తె ఏమైద్ది. సాచ్చంలేంది–"

"అందుకే నీ దగ్గరికొచ్చాం" అంతవరకు మాట్లాడని ఎ.ఇ.గారు నోరు విప్పారు.

రాజయ్య ఎ.ఇ.గారి వైపు చూసాడు. ఎ.ఇ.గారు రాజయ్యనే చూస్తున్నాడు.

'ఎదురుగ పోయి దండం దొర అంటె విని కూడా చేయెత్తని మనిషి, దరఖాస్తు పెట్టి ఏడాది అయ్యింది సార్ అంటె అంతా ఎస్.ఓ. గారు చూసుకుంటారు పో అన్నాయన ఈయాల నా దగ్గర కొచ్చిండు. నా సాచ్చం కావాలంట. నేను సేసింది సెవుత అంతె' అని మనసులో అనుకొని "నన్నేం సెయ్యమంటరో సెప్పండ్రి"

"ఏం చెయ్యక్కర్లేదు. మాకునీవు ఎలాంటి లంచం ఇవ్వలేదని చెప్పాలంతే" అంతవరకు మంచం పట్టెకు ఆనించిన చేతులను వొక్క దగ్గరికి చేర్చి నలువు కుంటూ అన్నాడు ఎస్.ఓ.

'ఈ రోజుల్లో లంచం లేకుండా ఎవరైనా ఏ పనైనా చేస్తున్నారా అని! తాను చెప్పినా నమ్ముతారా. లాభం కలిగే చోట లంచం. నష్టం వచ్చే చోట లంచమే. పని చేసినందుకు లంచం, ఎద్దుకో సూదిస్తే లంచం, కరెంటు పెట్టుకున్నందుకు లంచం, కరెంటు నడిపిచ్చుకున్నందుకు లంచం, ఆఖరికి పండించిన పంట అమ్మేటందుకు పోతె అక్కడ ధర పల్కటం దుకు లంచమేనాయె!

ఈ లంచాల లోకంలో నేను లంచం ఇయ్యలేదంటే ఎవరు నమ్ముతరు' అని ఆలోచిస్తున్న రాజయ్య నుద్దేశిస్తూ

"రేపో, ఎల్లుండో నీ దగ్గర్కి ఎంక్వయిరీకి వొస్తరు. వాళ్ళకు ఇంతే చెప్ప."

"నేను సెపితె నమ్ముతరంటరా!"

"చెప్పాల కాని ఎందుకు నమ్మరు" బొక్కెన మీద కూర్చున్న ఎల్.ఐ. పక్కనే నిలుచున్న లైన్‌మెన్ వైపు చూస్తూ.

"అంతేకదా" లైన్‌మెన్ రాజయ్య వైపు చూస్తూ.

"ఒకేల్ల ధర్మం తినమంటే"

"డబ్బులిచ్చి ధర్మం తింటే లత్త కొట్టదు" మళ్లీ తానే–

"నేను చెప్పలేదండి ఆయన ఇచ్చిన డబ్బులు ఆయ నకు వాపసివ్వండి. అంతే వేరే మార్గం లేదు" అంటూ తన జేబు నుండి ఐదొందలు తీసి మంచం మీద వున్న డైరీ మీద పెట్టాడు ఎ.ఇ.గారు.

"అంతేసార్" అంటూ తానో ఐదొందలు తీసి వాటి పైన్నే పెట్టారు ఎస్.ఓ.గారు.

వాళ్ళను చూసి ఎల్.ఐ. 'ఐదొందలు'!

"మరి ఇ.ఇ. కిచ్చినయి సార్" ఎస్.ఓ

"మీరు కలిపి ఇయ్యండి అడుక్కుందురుగాని"

మరో ఐదొందలు కలిపారు. మొత్తం రెండు వేలు. వాటినే చూస్తున్న రాజయ్య 'మిగతా ఐదొందలు?' అనుకుంటున్నాడు మనస్సులో నోట్లను సరిచేసి మరోసారి లెక్క పెట్టి. 'ఇదిగో ఈ రెండు వేలు' రాజయ్యకియ్యబోయెసరికి రాజయ్య లేచి నిల్చుని "ఇచ్చి తీసుకుంటె ఏం బాగుంటది. నేను సెప్పేది సెవుతలెండి."

"అమ్మమ్మ వద్దు. కేసు చాలా సీరియస్ కొచ్చింది. ఛైర్మన్‌గార్కి, మంత్రిగారికి కూడా దరఖాస్తులు వెళ్ళినయి' అన్నాడు ఎ.ఇ.గారు. 'మా ఉద్యోగాలు వూడుతయ్" అన్నాడు ఎస్.ఓ.

"ఊడితేంది? దొరలు బతకలేర. కూడపెట్టినయన్నీ ఎటు పోతయి? మీ ఇండ్లు, పెండ్లాలు, మీ ఆస్తులు అన్ని సూస్తి గదా?" అని మనస్సులోనే అనుకుంటున్న రాజయ్య నుద్దేశిస్తూ–

"ఇవి వుంచుకో స్టోర్‌లో ఇచ్చిన రెండొందలు రావు. వాడు ఆ రోజే తాగేసుండొచ్చు. సెక్షన్ల ఇచ్చినయి పంచుకొని కర్చుపెట్టుకోవచ్చు" ఎస్.ఓ.

'అంతా పకీర్ సన్నాసులు ఇన్ని రోజులున్నాయ్' ఎ.ఇ.

'ఈల్లు నవాబు కొడుకులేమో, అవును అంతేలే ఆఫీసులొదిలి వూర్లో తిరిగే నవుకరుగాళ్ళంతా అంతే, ఏ ఊరికి పోతే ఆ వూరు అత్తగారిల్లు అనుకుంటరు' అంటూ నిలుచున్న రాజయ్య చుట్టూ అందరూ లేచి నిల్చొని రూపాయలు అతని దోసిటిలో వుంచుతూ మరీ మరీ బ్రతిమిలాడారు. ఎ.ఇ.గారు బుజమ్మీద చెయ్యేసి నిమిరాడు. ఎస్.ఓ.గారు దోసిటిలో నోట్లుంచి ఆపై చేతులు పట్టుకున్నాడు. ఎల్.ఐ. గదమ పట్టుకున్నాడు.

"రాజన్న మా బ్రతుకులు నీ చేతిలో వున్నయి. పిల్లలు గలోల్లం" అంటూ వుంటే రాజయ్య అందర్నీ ఒక్కసారి చూశాడు.

'పిరికి కొడుకులు సచ్చు సన్నాసిగాళ్ళు' అని మనసులో అనుకుంటూ "ఇక పదండి" అంటూ జీపు వైపు నడిచాడు. అతని వెంట వాళ్ళు.

"ఏసిబి వాళ్ళు కూడా రావచ్చు."

"ఆల్లెవరు"

"లంచాలు తీసుకునేవాళ్ళను పట్టుకునేవాళ్ళు."

"వాళ్ళూ లంచాలు తీసుకోరా"

నలుగురూ నవ్వారు.

***

జీపు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

"నీయమ్మ ఈల్లకంటే ముందు వాల్లెవరో వచ్చి జరిగిందంతా అడిగి రాసుకొని పోయిన సంగతి ఈల్లకేం యెరుక!

అయినా కష్టపడ్డ సొమ్ము యాడికిపోద్ది. సేరాల్సిన కాడికే సేరింది" అనుకుంటూ రాజయ్య బావి వైపు నడిచాడు.

## మొదటి రాజకీయ ఖైదీ

తెలుగుదేశంలోనే గాదు, నాటి మద్రాసు రాష్ట్రంలో కారాగార వాసం అనుభవించిన మొదటి రాజకీయ ఖైదీ శ్రీ గాడిచెర్ల హరి సర్వోత్తమరావు. ఆయన "స్వరాజ్య" వారపత్రికద్వారా బ్రిటిష్ వారిని తీవ్రంగా విమర్శించాడు. ప్రభుత్వం ఆయనను జైల్లో పెట్టింది.

నాడు వెల్లూరు జైలులో ఈ దక్షిణాది తొలి రాజకీయ ఖైదీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు అనుభవించిన శిక్ష నిజంగా మహాభయంకరమైనది. ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం తల గొరిగించి, కాళ్ళకు సంకెళ్ళు వేసి, మెడలో ఇనుప కంటె వేసి, గోచీ మాత్రమే కట్టుకోవటానికి ఇచ్చి తిండికి, నీటికి మట్టి మూకుడు, మట్టి ముంత ఇచ్చి, కఠినాతి కఠినంగా వెల్లూరు జైలులో చిత్రహింసలపాలుచేసింది. తర్వాత వయోజన విద్యావ్యాప్తికి ఆయన ఎంతో కృషి చేశారు.

డాక్టర్ మల్లీప్రియ "నాగరాజు"

---

"నువ్వీసారి పుట్టింటికెళ్లినప్పుడు, నగా, నట్రా వేసుకెళ్లలేదేం?" భర్త అడిగాడు భార్యను.

"అవి వేసుకెళ్లి తిరిగొచ్చినపుడల్లా, మీ చేతికి (తాసూ, గీటురాయి యివ్వలేక ఛస్తున్నాను!" రుస, రుసలాడుతూ అంది భార్య.

—బచ్చు వీరరాజు

---